సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 25 । ఆగస్టు । 2024



చిదిమేస్తున్నారు..!

ఆడపిల్ల పుట్టిందంటే గతంలో మహాలక్ష్మి పుట్టిందని కుటుంబం అంతా సంతోషించే వారు.

- 8లో



అర్ధరాత్రి యువకుల హల్‌చల్..

రాజాం ప్రాంతంలో విష సంస్కృతి జాఢ్యం రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో ప్రజలు భయాం దోళనలు చెందుతున్నారు.

- 8లో



విధులే క్రియాశీలకం

నిందితులకు శిక్షలు ఖరారు కావడంలో కోర్టు కానిస్టేబుళ్ల విధులు క్రియాశీలకమని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

కోటదుర్గమ్మను దర్శించుకున్న జేసీ శోభిక



పాలకొండ శ్రీకోటదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జేసీ శోభిక

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ శ్రీ కోటదుర్గమ్మను పార్వతీపురం మన్యం జిల్లా జేసీ శోభిక శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జేసీకి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆమె మండలంలోని పరశురామ్‌పురం, సింగన్నవలస గ్రామాల పరిధిలో ఈ–పంట నమోదును పరిశీలించారు. రైతులు వేసిన పంటలు, ఇంత వరకు చేసిన ఈ–పంట వివరాలను వ్యవసాయ శాఖ ఏడీఏ రత్నకుమారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాలకొండలో ఉన్న పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆమెతో పాటు ఆర్‌డీఓ వెంకటరమణ ఉన్నారు.

నేడు లఖ్‌పతి దీదీ

పార్వతీపురం: లఖ్‌పతి దీదీ కార్యక్రమం ఆదివారం ఉదయం 11గంటలకు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి మోదీ మహారాష్ట్రలోని జలగాన్ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని దీనిని వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని రాష్ట్రాల్లో, జిల్లాల్లో, మండలాల్లో మండల సమైఖ్య కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. లక్ష రూపాయలు, అంతకంటే ఎక్కువ వార్షిక కుటుంబ ఆదాయాన్ని ఆర్జించేలా స్వయం సహాయక సభ్యురాలిని చేయడమే లక్‌పతి దీదీ లక్ష్యమన్నారు. మెరుగైన జీవనోపాదులు పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. జిల్లాలో రానున్న ఐదేళ్లలో 15 మండలాల్లోని 46,273 మంది సభ్యులకు రూ.లక్ష ఆదాయం వచ్చేలా వివిధ రకాల రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. ఆదివారం నిర్వహించే కార్యక్రమంలో 5212 మంది సభ్యులకు రూ.56.64కోట్లు బ్యాంకు లింకేజీగా, 124మందికి సీఐఎఫ్ కింద రూ.60లక్షలు, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కింద 117మందికి రూ.8.90 కోట్లు అందించనున్నట్టు తెలిపారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన సభ్యులకు ప్రశంసాపత్రాలు కూడా అందజేస్తారని పేర్కొన్నారు.

నిర్భయంగా విధులు నిర్వహించేలా...



వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చేవారి వెంట వచ్చే సహాయకులు కొన్ని సమయాల్లో అనుచితంగా ప్రవర్తించి వైద్యులను, సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తుంటారు. వారిని ఎదుర్కోవటం కష్టం. అటువంటి వారిని కట్టడి చేయాలి. లేకుంటే నిర్భయంగా విధులు నిర్వహించలేము. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ పరిస్థితులు వల్ల ఆందోళనకు గురవుతున్నాం. నిత్యం ఈ సమస్య ఉంటుంది. వందలాది మంది ఆరోగ్య సమస్యలతో వస్తారు. ఒక్కొక్కరి ప్రవర్తన ఒక్కోలా ఉంటుంది. ఈ క్రమంలో భద్రత అవసరం. క్యాజువాల్టీ, వార్డుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి.

–బి.యాదవేశ్వరి, హెడ్ నర్స్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ



పోలీస్ ఔట్ పోస్టు అవసరం



ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీస్ ఔట్ పోస్టు ఆవశ్యకత ఎంతైనా ఉంది. యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టాలి. సమస్యలు తలెత్తినప్పుడే ఈ ప్రస్తావన వస్తుంది. ఆపై చర్యలు ఉండకపోవటం శోచనీయం. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో ఏడుగురు మహిళా వైద్యులు ఉన్నారు. నర్సింగ్ స్టాఫ్‌తో పాటు నర్సింగ్ విద్యార్థినిలు పెద్దెత్తున రాత్రి పగలు సేవలు అందిస్తుంటారు. వారికి భద్రత అవసరం. గైనిక్, సర్జరీ, చిన్న పిల్లల, మహిళా వార్డుల వద్ద భద్రత ప్రమాణాలతో కూడిన రక్షణ సిబ్బందికి అవసరం. బాధితులతో వచ్చే సహాయకులు నిబంధనల మేరకు మాత్రమే వ్యవహరించేలా, హద్దు మీరితే చర్యలు ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలి.

–డాక్టర్ రౌతు భారతి, స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు, పాలకొండ ఏరియా ఆస్పత్రి.

ప్రకృతి సేద్యం ఫలిస్తోంది



గుమ్మలక్ష్మీపురం మండలంలోని నూరు శాతం ప్రకృతి వ్యవసాయం గ్రామం గొరడ వద్ద రైతులతో కలెక్టర్

- జిల్లాలో 74 వేల మందితో సాగు చేయించేలా ప్రణాళికలు
- ఆరోగ్యకర పంట ఉత్పత్తులు.. రైతుకు గిట్టుబాటు కల్పనే ధ్యేయం



అంతరపంటగా వేసిన కూరగాయల సాగును చూపుతున్న రైతులు



నాగూరులో జీవామృతం తయారు చేస్తున్న రైతు

సాక్షి, పార్వతీపురం మన్యం: మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల నానాటికీ అనర్థాలు అధికమవుతున్నాయి. మట్టిలో సత్తువ తగ్గి, సాగుకు మేలు చేసే సూక్ష్మ జీవులు అంతరించిపోతున్నాయి. ఖర్చు పెరుగుతూ.. గిట్టుబాటు దక్కక.. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను అందించడమే కాక.. ఇటు అధిక ఆదాయం పొందేలా.. ప్రకృతి సాగు దిశగా జిల్లాలో అధికార యంత్రాంగం కొన్నేళ్లుగా రైతులను మళ్లిస్తోంది. సేంద్రియ ఉత్పత్తుల వల్ల ఆరోగ్యం పదిలంతో పాటు.. లాభాల బాట పట్టవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఆ దిశగా వారు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి.

96 వేల ఎకరాల్లో సాగు లక్ష్యం

పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గిరిజన ప్రాంతాలే అధికం. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, సీతంపేట, మక్కువ, పాచిపెంట, సాలూరు తదితర ప్రాంతాల్లో సహజసిద్ధ వనరులకు లోటులేదు. ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. ఇక్కడి ఆరోగ్యకర వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. సాగులో రసాయన వినియోగాన్ని తగ్గిస్తూ.. రైతులను పూర్తిగా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా అధికారులు కొన్నాళ్లుగా కృషి చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 74 వేల మంది రైతులను 96 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు దిశగా తీసుకెళ్లేందుకు నిర్దేశించుకున్నారు. ఇందులో పూర్తిగా వంద శాతం రసాయన రహిత పంటల సాగును 38,500 మంది రైతులతో చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వరి, జీడి, పత్తి, మొక్కజొన్న తదితర మేలైన పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

ప్రధాన పంట వరితో పాటు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా గట్లపైన చిక్కుడు, బీర, కాకర, మునగ, అరటి, బెండ తదితర కూరగాయలు.. కంది, బంతి వంటి వాటిని వేయడానికి ప్రోత్సహిస్తున్నారు. దీనికి అవసరమైన అవగాహన కల్పిస్తున్నారు. కేవలం అంతర పంటల వల్లే రైతులకు గట్ల పరిమాణం బట్టి ఎకరాకు రూ.600 నుంచి రూ.వెయ్యి వరకు లాభం వస్తోంది. నవ ధాన్యాల సాగు కీలకం కావడంతో.. దీనిపై అవగాహన కల్పిస్తూ కిట్ల రూపంలో పంపిణీ చేస్తున్నారు. సుమారు 50 వేల మంది రైతులతో ఈ పద్ధతిని అవలంబిస్తున్నారు. దీనివల్ల ఎరువుల వినియోగం, పురుగుల నష్ట తీవ్రత, కలుపు తీవ్రత తగ్గుతుంది. నవ ధాన్యాలను వరి, మిశ్రమ పంటల్లోనూ తీసుకెళ్తున్నారు.

ఎనీటైం మనీ వచ్చేలా ప్రదర్శన క్షేత్రాలు

20 సెంట్ల భూమి ఉన్న ప్రతి రైతుకూ ఆరోగ్యకరమైన ఆహారం, కూరగాయలు, పండ్లు వంటివి అందిస్తూ.. ఏటీఎం మోడల్ (ఎనీటైం మనీ) నిరంతరం ఆదాయం వచ్చేలా ప్రదర్శన క్షేత్రాలను ఈ ఏడాది 622 వరకు లక్ష్యంగా పెట్టుకుని రైతుల పొలాల్లో వేయాలని సంబంధిత అధికారులు నిర్దేశించుకున్నారు.

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం..

ప్రస్తుతం రసాయనాల ద్వారా సాగు చేస్తున్న పంటల్లో మనిషికి కావాల్సిన రోజువారీ పోషకాలు తగ్గిపోయాయి. పోషకాలు అందక వ్యాధి నిరోధక, శరీర పటుత్వం తగ్గిపోవడం వల్ల త్వరగా అనారోగ్యానికి గురవుతున్నారు. రసాయనాల వినియోగం వల్ల రైతుకు కూడా అదనపు ఖర్చులే. ఈ నేపథ్యంలోనే ప్రకృతి వ్యవసాయం వైపు వారిని మళ్లిస్తున్నాం. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో కనీసం ఒక ఎకరా భూమిలో ప్రకృతి వ్యవసాయం సాగు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. క్రమంగా సాగు విస్తీర్ణం పెంచుకుంటూ వచ్చే ఐదేళ్లలో కనీసం 40 శాతం ఈ విధానంలో సాగు చేసే విధంగా కృషి చేయాలన్నది మా లక్ష్యం. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– పి.షణ్ముఖరాజు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్, ప్రకృతి వ్యవసాయం

జిల్లా వ్యాప్తంగా 212.5 ఎకరాల్లో లక్ష మొక్కలు

- జిల్లా అటవీ శాఖాధికారి వెంకటేష్



కొత్తపేటలోని దమరసింగి రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ వెంకటేష్

నెల్లిమర్ల రూరల్: జిల్లా వ్యాప్తంగా 212.5 ఎకరాల్లో లక్ష మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.వెంకటేష్ తెలిపారు. మండలంలో కొత్తపేట దమరసింగి రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల విస్తీర్ణాన్ని పెంచాలనే ఏకైక లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా అటవీ శాఖ భూముల్లో మొక్కలు నాటుతున్నామన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సహకరించాలన్నారు. మొక్కలు పెంచుతున్న ప్రాంతాల్లో మూగ జీవాలు వెళ్లకుండా చూడాలన్నారు. దమరసింగి రిజర్వు ఫారెస్ట్‌లో 50 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 20 వేల మొక్కలు నాటామని చెప్పారు. రావి, వేప, పనస, నేరేడు, టేకు, బాదం, ఉసిరి, నెమలి నార, ఎర్ర చందనం, తదితర 21 జాతుల మొక్కలు నాటుతున్నామన్నారు. జిల్లాలో షికారుగంజి, దమరసింగి, బేతానాపల్లి, తదితర రిజర్వు ఫారెస్ట్‌లో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నామన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నర్సరీల్లో 6లక్షల మొక్కలను అందుబాటులో ఉంచామని, ప్రభుత్వ సంస్థలకు, కార్యాలయాలకు ఉచితంగా అందజేస్తున్నారు. మొక్కలు కావాల్సిన వారు స్థానిక అటవీశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది అప్పలరాజు, కేవీఎస్ రాజు పాల్గొన్నారు.

జీవ వ్యవస్థలో యంత్రాల వినియోగం కీలకం



మాట్లాడుతున్న, ఐఐటీ చెన్నై ప్రొఫెసర్ ప్రసాద్ పట్నాయక్

- ఐఐటీ చెన్నై ప్రొఫెసర్ ప్రసాద్ పట్నాయక్

విజయనగరం అర్బన్: జీవ వ్యవస్థలోని రక్త ప్రవాహం నుంచి అవయవాల పని తీరు వరకు ఏది తెలుసుకోవాలన్నా అధునాతన యంత్ర పరికరాల వినియోగం కీలకంగా నిలుస్తుందని ఐఐటీ చెన్నై ప్రొఫెసర్ ప్రసాద్ పట్నాయక్ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ గురుజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'సీ ఎఫ్ డీ బేస్డ్ మోడలింగ్ ఆఫ్ మెకానికల్ సర్క్యులేటరీ సపోర్ట్ సిస్టిమ్స్ ఫర్ ది హ్యూమన్ బాడీ' అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ సర్క్యులేటరీ సపోర్ట్ సిస్టమ్‌ల అభివృద్ధి, ఆప్టిమైజేషన్ సీఎఫ్‌డీ మానవ ప్రయోజనీకరమని అన్నారు. ఈ వ్యవస్థలు గుండె వైఫల్యంతో బాధపడుతున్న రోగులు తాత్కాలిక సహాయాన్ని అందించడంలో కీలకంగా పని చేస్తాయన్నారు.

అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్‌లో లిఖిత ప్రతిభ



లిఖితకు మిఠాయిలు తినిపిస్తున్న తల్లిదండ్రులు శ్రీనివాసరావు, పద్మావతి

పాలకొండ రూరల్: పట్టణంలోని వేమకోటివారికి వీధికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని బంకురు లిఖిత తాజాగా విడుదలైన నీట్ పీజీ ప్రవేశ ఫలితాల్లో తన ప్రతిభ కనబరిచారు. 99.53 శాతంతో ఆల్ ఇండియా స్థాయిలో 1034 ర్యాంకును కైవసం చేసుకున్నారు. విజయనగరం మిమ్స్‌లో మెడిసిన్ పూర్తి చేసిన లిఖిత తల్లి పద్మావతి ప్రభుత్వ ఉపాధ్యాయిని కాగా తండ్రి శ్రీనివాసరావు వ్యాపారం చేస్తున్నారు.

'పీఎం జన్‌మన్'తో మౌలిక సదుపాయాలు



- పైలట్ ప్రాజెక్టు కింద 5 మోడల్ గిరిజన గ్రామాల ఎంపిక
- సెప్టెంబర్ మొదటి వారంలో మెగా ఈవెంట్
- జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్

విజయనగరం అర్బన్:

ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం ద్వారా కొన్ని ప్రత్యేక గిరిజన తెగల (పీవీటీజీ) అభివృద్ధికి వారి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ కోరారు. దీని కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. గదబ తదితర అతి సున్నిత గిరిజన తెగలు నివసించే గ్రామాలు జిల్లాలో 52 వరకు ఉన్నాయని చెప్పారు. వీటిలో ఎస్.కోట మండలం కొత్తపాలెం, పుణ్యగిరి, వేపాడ మండలం గదబవలస, బాడంగి మండలం ఆకులకట్ట, తెర్లాం మండలం తమ్మయ్యవలస గ్రామాలను నమూనా గ్రామాలుగా ఎంపిక చేశామని వెల్లడించారు. పీఎం జన్‌మన్ కార్యక్రమం అమలు గురించి గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, ఏపీఈపీడీసీఎల్, వైద్యారోగ్యం, విద్య, గ్రామీణ నీటి సరఫరా, బీఎస్‌ఎన్‌ఎల్, స్త్రీశిశు సంక్షేమ శాఖల అధికారులతో జేసీ తన చాబర్‌లో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమం అమలులో భాగంగా ఆయా శాఖలు చేపట్టిన ప్రతిపాదనలపై ఆరా తీసారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అతి సున్నిత గిరిజన తెగల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని, దీని కోసం ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమం కింద ఈ తెగలు నివసించే గ్రామాల్లో విద్య, వైద్యం, ఆరోగ్యం, గృహనిర్మాణం, తాగునీరు సరఫరా, విద్యుత్, పౌష్టికాహారం, రహదారులు తదితర మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. దీని కోసం ఆయా శాఖ అధికారులు ఈ 52 గ్రామాల్లో పర్యటించి 15 రోజుల్లో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ప్రధానంగా మోడల్ గ్రామాల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పీఎం జన్‌మన్ కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి గిరిజన తెగల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ మొదటి వారంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో మెగా ఈవెంట్‌ను నిర్వహించనున్నామని దీనికి భారీ ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇసుకాసురులకు... కాసుల వర్షం

- వంశధార నదిని చెరబట్టి ఇసుక దోపిడీ
- భామిని మండలంలో పసుగుడి వద్ద అక్రమ వ్యాపారం
- కొందరు అధికారులు, అధికార పార్టీ నాయకుడి అండదండలు!





ఈ ఫోటో చూశారా? చీకట్లో వెళ్తున్న ఈ లారీ... ఇసుక లోడుతో వెళ్తున్నదే. మరి రాత్రిపూట ఎందుకు వెళ్తుంది అంటారా? చేస్తున్న పని దొంగపని కాబట్టి! ఇసుక ఉచితం ... ఎక్కడైనా ఎవరైనా అక్రమంగా తరలిస్తే కాళ్లు విరిచేస్తాం! కఠిన చర్యలు తీసుకుంటాం! అని కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు పదే పదే వల్లిస్తున్న మాటలెలా ఉన్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇసుక దొంగలు పేట్రేగిపోతున్నారు. వంశధార నదిని చెరబట్టారు. ఇదేమి దౌర్జన్యంరా బాబూ అనుకుంటూ పోలీసులకు ఫోన్ చేస్తే... ఇసుకాసురులపై చర్యలు సంగతి అలా ఉంచి సమాచారం ఇచ్చిన వ్యక్తి గుట్టు కాస్త వారికే చేరవేస్తున్నారు. 'ఇది మా ప్రభుత్వం. తెలుగుదేశం ప్రభుత్వం. పోలీసులు మావాళ్లే. తహసీల్దారు మాకు తెలిసినోడే. ఎవడికి చెప్పుకుంటారో చెప్పుకోండి. మా వెంట్రుక కూడా పీకలేరు' అని ఆ ముఠాలో సభ్యుడు బాధిత గ్రామ నడిబొడ్డున నిలబడి సవాలు చేస్తున్నాడంటే... అతని ధైర్యం ఎవరు? అతని వెనుకున్నది ఎవరు? అనే సందేహం వస్తుంది కదా? సందేహం అక్కర్లేదు ఆ ధైర్యం ఇస్తున్నదే టీడీపీలో ఓ మండల స్థాయి నాయకుడు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి ఇసుక మాఫియాకు సకల సహకారాలు అందిస్తున్నాడు. ఇదంతా జరుగుతున్నది వేరెక్కడో కాదు... పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని పసుగుడి గ్రామ సమీపంలోనే!

రూ.లక్షలు కళ్లజూస్తున్న ముఠా

పసుగుడి వద్ద ఒక లారీ ఇసుక లోడుకు రూ.30 వేల వరకూ ముఠా వసూలు చేస్తోంది. ఒకవేళ ఎక్కడైనా తనిఖీ జరిగితే చూపించడానికి ఒడిశా రాష్ట్ర పర్మిట్ కాపీ లారీ డ్రైవర్‌కు ఇస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలో కొని తెచ్చుకుంటున్నట్లు చూపించడానికి అది పనికొస్తుందని చెబుతున్నారు. ఈ ముఠాలో ఐదుగురు కీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ టీడీపీ మండల స్థాయి నాయకుడు, ఆయన మేనల్లుడు ఒడిశా నుంచి ఫేక్ పర్మిట్లు తేవడంలో నేర్పరి నవీన్, దొంగ కర్రల వ్యాపారంలో ఆరితేరిన మురళి, నదిలో ఇసుక తవ్వించడంలో అనుభవం ఉన్న చిన్నారావు, పగలు ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూ రాత్రిపూట ఇసుక వ్యాపారం చేసే వేణు పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రతి రోజూ కనీసం రూ.3 లక్షల వరకూ ఈ ముఠా ఆదాయం ఉంటుందనేది బహిరంగ రహస్యమే.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఇసుక అక్రమ రవాణాకు భామిని మండలం ప్రధాన కేంద్రమైపోయింది. ఒడిశా సరిహద్దులో ఉండటం, వంశధార నదిలో పుష్కలంగా ఇసుక మేటలు, దొంగరవాణాకు ఒడిశా రాష్ట్ర పర్మిట్లు తెచ్చే దళారులు, పరిరక్షించాల్సిన పోలీసు, రెవెన్యూ శాఖల్లోనే సమాచారమిచ్చే ఇంటిదొంగలు, ఎన్ని చేసినా అండగా ఉండే టీడీపీ నాయకులు... ఇన్ని అనుకూలాంశాలు ఉన్నాయి. దీంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. చీకటి పడితే చాలు వీరి ఆగడాలతో పసుగుడి గ్రామస్తులు హడలిపోతున్నారు. దొంగ ఇసుక లారీలన్నీ ఆ గ్రామ ప్రధాన రహదారి మీదే రాకపోకలు సాగిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారి భయం.

- **చీకటిపడితే ఇసుక చోరీ**

సాయంత్రం 6 గంటలయ్యేసరికి ఓ జేసీబీ, పది ట్రాక్టర్లతో ముఠా రంగప్రవేశం చేస్తుంది. వంశధార నదిలోకి వెళ్లి ఇసుక తవ్వి తెచ్చి సమీప తోటల్లో పోగులు వేస్తారు. తెల్లార్లూ వంద లోడుల వరకూ ఇసుక తోలేస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటలకల్లా బయట ప్రాంతాల నుంచి లారీలు పసుగుడి గ్రామానికి వచ్చేస్తాయి. ప్రత్యేక లైట్లతో పోగుల దగ్గరకు తీసుకెళ్లి ఆ లారీలకు ఇసుక ఎత్తి జాగ్రత్తగా మళ్లీ వెనక్కు పంపిస్తారు. ఈ రాకపోకలన్నీ పసుగుడి గ్రామ ప్రధాన రహదారిపైనే సాగుతాయి. ఈ వాహనాల దెబ్బకు ఆ రహదారి మొత్తం ధ్వంసమైపోయిందంటే అక్రమ రవాణా ఎంత జోరుగా సాగుతుందో ఊహించవచ్చు.

- **మొత్తుకున్నా స్పందన శూన్యం**

రాత్రంతా లారీలు, ట్రాక్టర్ల జోరుతో పెద్ద వీధిలో ఆడుకునే పిల్లలు, కళ్లు సరిగా కనిపించని వృద్ధులు ఎక్కడ ప్రమాదానికి గురవుతారోనని పసుగుడి గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వాటికి అడ్డుకట్ట వేయండని పోలీసులకు మొత్తుకున్నా స్పందన లేదని వాపోతున్నారు. ఇటీవల చిన్నారావు అనే గ్రామస్తుడు 100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే... ఇసుక అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోలేదని, ఫలానా వ్యక్తి ఫోన్ చేశాడని వారికే సమాచారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు..


డోలీలో ఆశయ్యను తీసుకువస్తున్న గ్రామస్తులు

పాచిపెంట: మండలంలోని పలు గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయంలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఏ చిన్న కష్టం వచ్చినా డోలీలే శరణ్యమవుతున్నాయి. అందులోనూ వర్షాకాలంలో అయితే వారి కష్టాలు వర్ణనాతీతం. ఇలాంటి సంఘటన మండలంలోని గొట్టూరు పంచాయతీ రిట్లపాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. రిట్లపాడు గ్రామానికి చెందిన సేబి ఆశయ్య(59) కొన్ని రోజులుగా టీబీ వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. అయితే ఆశయ్య ఆరోగ్యం శనివారం ఉదయానికి బాగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు సుమారు 15 కిలోమీటర్లు డోలీ ద్వారా మైదాన ప్రాంతానికి తీసుకువచ్చి, అక్కడ నుంచి ఆటోలో గురువునాయుడుపేట పీహెచ్‌సీకి తరలించారు. వెంటనే సిబ్బంది స్పందించి వైద్యసేవలు అందించడంతో ఆశయ్య ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది.

జాతీయ తైక్వాండో పోటీల్లో హిమశ్రీ ప్రతిభ



హిమశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి, తదితరులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో విజయనగరానికి చెందిన క్రీడాకారిణి వారణాసి హిమశ్రీ ప్రతిభ చాటింది. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన 41వ జాతీయ జూనియర్స్ బాల, బాలికల తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన హిమశ్రీ 52 కిలోల విభాగంలో కాంస్య పతకం చేజిక్కించుకుని విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పింది. ఈమేరకు హిమశ్రీని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారిప్రసాద్, కోచ్ రవి, కస్పా ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు సౌధామణి పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలోని పూల్‌బాగ్ కాలనీ బిట్ -4లో కొందరు న్యూసెన్స్ చేస్తున్నారని డయల్ 100కి వచ్చిన కాల్ ఆధారంగా అక్కడకు వెళ్లిన టూటౌన్ కానిస్టేబుల్ కృష్ణపై రాళ్లతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో శనివారం ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించగా.. మరొకరిని జువైనల్ హోమ్‌కు తరలించామని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఆదిభట్ల ముని మనవరాలు కామేశ్వరమ్మ మృతి


కామేశ్వరమ్మ (ఫైల్)

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు ముని మనవరాలు కామేశ్వరమ్మ (88) శనివారం సాయంత్రం కన్నుమూశారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతిపై పలువురు తమ సంతాపాన్ని తెలియజేశారు.



నిందితులను శిక్షించాలి..

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరం. వైద్య కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. ఆస్పత్రిలోకి వచ్చే బయట వారిపై సరైన నిఘాపెట్టాలి. మత్తు పదార్థాలు సేవించే వారిపై చర్యలు తీసుకోవాలి. అత్యవసర సమయంలో ప్రాణాలు నిలిపే వైద్యులపైనే దాడులు చేయడం ఎంతవరకు న్యాయం.

– జి. త్రివేణి, వైద్యురాలు, గుమ్మలక్ష్మీపురం సీహెచ్‌సీ



అనుమతించరాదు..

రాత్రి పూట ఆస్పత్రుల్లోకి రోగులకు చెందిన ఇతర వ్యక్తులను అనుమతించకూడదు. ఇన్ పేషెంట్లు ఉండే గదుల్లోకి సహాయకులుగా వచ్చే వారికి కూడా గుర్తింపు కార్డులు ఇవ్వాలి. మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రి పూట విశ్రాంతి తీసుకోవడానికి, దుస్తులు మార్చుకోవడానికి ఆస్పత్రుల్లో ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలి. నర్సులు, మహిళా వైద్యులకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ఇందుకోసం ప్రత్యేక చట్టాలు రూపొందించాలి.

– ఎం. చాందిని, వైద్యురాలు, జిల్లా ఆస్పత్రి



చిదిమేస్తున్నారు..!

- తగ్గుతున్న బాలికల సంఖ్య
- 13 మండలాల్లో గణనీయంగా తగ్గిన వైనం
- స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ కరువు

ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్న మండలాల వివరాలు..

మండలం	వెయ్యి మంది ఉండాల్సిన చోట ప్రస్తుతం ఉన్న ఆడ పిల్లల సంఖ్య
బాడంగి	769
బొబ్బిలి	796
దత్తిరాజేరు	429
డెంకాడ	800
గజపతినగరం	772
గంట్యాడ	750
గుర్ల	333
మెంటాడ	800
నెల్లిమర్ల	868
రాజాం	866
ఆర్. ఆముదాలవలస	500
ఎస్.కోట	838
వేపాడ	857



ఆడపిల్ల రక్షణకు సంబంధించిన వాల్ పోస్టర్

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్ల పుట్టిందంటే గతంలో మహాలక్ష్మి పుట్టిందని కుటుంబం అంతా సంతోషించే వారు. బంధువులందరికీ స్వీట్స్ పంచుతూ ఆనందాన్ని పంచుకునేవారు. కాని నేడు అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఆడపిల్ల పుడితే భారమనే ధోరణిలో కొంతమంది తల్లిదండ్రులున్నారు. మరి కొంతమంది తల్లిదండ్రులు కడుపులో ఉన్నది ఆడ శిశువా, మగ శిశువా చెప్పాలని స్కానింగ్ సెంటర్లపై ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు కాసులకు కక్కుర్తి పడి లింగ నిర్ధారణ వెల్లడిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఆడపిల్ల అని తెలితే గర్భంలోనే తుంచేస్తున్నారు. వీటి వల్ల జిల్లాలో ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 1000 మంది ఆడపిల్లలు ఉండాల్సిన చోట కొన్ని చోట్ల 800 ఉంటే.. మరికొన్ని చోట్ల ఆరేడు వందల మంది చొప్పున ఉన్నారు. దీన్ని బట్టి పరిస్థితేమిటో అర్థం చేసుకోవచ్చు.

13 మండలాల్లో..

జిల్లాలో 27 మండలాలుంటే 13 మండలాల్లో ఆడపిల్లలు తక్కువగా ఉన్నారు. బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, డెంకాడ, గజపతినగరం, గంట్యాడ, గుర్ల, మెంటాడ, నెల్లిమర్ల, రాజాం, రేగిడి ఆముదాలవలస, ఎస్.కోట, వేపాడ మండలాల్లో ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉంది.

కానరాని పర్యవేక్షణ..

జిల్లాలో 70 వరకు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిపై పర్యవేక్షణ అంతంత మాత్రమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి లింగ నిర్ధారణ ఎవరైనా వెల్లడిస్తున్నారా.. లేదా అని తనిఖీ చేయాల్సి ఉంది. లింగ నిర్ధారణ కోసం డెకాయ్ ఆపరేషన్లు (ఎంపిక చేసుకున్న గర్భిణిని స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్లి లింగ నిర్ధారణ చేయమని అడగడం) చేయాల్సి ఉంది. అటువంటి డెకాయ్ ఆపరేషన్లు జిల్లాలో ఎక్కడ కానరావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక దృష్టి సారించాం..

ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఆయా మండలాల పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్లను నిరంతరం పర్యవేక్షణ చేయాలని ప్రోగ్రాం అధికారులకు ఆదేశాలిచ్చాం. లింగ నిర్ధారణ చేసినట్లు సమాచారం ఇస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

వేధింపులు భరించలేకపోతున్నాం..

- జిల్లా ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల అసోసియేషన్


మాట్లాడుతున్న జిల్లా ఆర్టీసీ అద్దెబస్సుల యజమానుల అసోషియేషన్ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలోని ఓ అధికారి వ్యాట్ పెండింగ్ పన్నుల పేరుతో రికవరీలు చేస్తూ వేధిస్తున్నారని జిల్లా ఆర్టీసీ అద్దెబస్సుల యజమానుల అసోషియేషన్ ఆరోపించింది. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, జిల్లాకి చెందిన వివిధ అద్దె బస్సులకు సంబంధించి 2014–15, 2016–17 ఆర్థిక సంవత్సరాల వ్యాట్ పన్ను దాదాపు రూ.3.30 కోట్లు అప్పట్లో చెల్లించామని తెలిపారు. అప్పటి నిబంధనల మేరకు 5 శాతం పన్నును ఆర్టీసీ సంస్థే చెల్లించిందన్నారు. 2020 తర్వాత శాఖాపరమైన అధికారులు మారడంతో అప్పటి పన్నులు ఇంకా బకాయి ఉందని తమకు నోటీసులు పంపించారని చెప్పారు. ఎలాంటి ఆధారాలు చూపకుండా 14 శాతం పన్ను చెల్లించాలని నోటీసులు ఇచ్చారన్నారు. 45 అద్దె బస్సులకు సంబంధించి బకాయిగా చూపించిన దాదాపు రూ.2.20 కోట్లకు గాను నెలకు రూ.25 లక్షల వంతున 8 నెలల పాటు బకాయి తీర్చాలంటూ ఆర్టీసీ సంస్థకు కమర్షియల్ ట్యాక్స్ అధికారి సమాచారం ఇచ్చారన్నారు. ఈ సమాచారాన్నే ఆదేశంగా తీసుకొని స్థానిక ఆర్టీసీ అధికారులు మాకు రావాల్సిన వేతనాల నుంచి రికవరీలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ మొత్తం రికవరీ చేయడంతో బస్సుల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నామని వాపోతున్నారు. కమర్షియల్ ట్యాక్స్ అధికారి తీరుతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల అసోషియేషన్ అధ్యక్షుడు బి.రామకృష్ణ, కార్యదర్శి బి.సత్యనారాయణ, వీవీ రామారావు (రాంబాబు), సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద అనధికార వ్యక్తి దందా..

- పట్టించుకోని అధికారులు


జెండా ఊపి లారీని ఆపుతున్న అనధికార వ్యక్తి

గజపతినగరం రూరల్: గొట్లాం సమీపంలోని గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో నిర్వహిస్తున్న చెక్‌పోస్టులో (తనిఖీ కేంద్రం)ఓ అనధికార వ్యక్తి వాహనాలను ఆపి దందా చేస్తున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. మార్కెట్ సెస్ వసూలు చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టులో ఏఎంసీ ఇద్దరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించింది. అయితే వారిద్దరూ ఎప్పుడూ విధులు నిర్వహించకపోవడంతో పక్కనే ఉన్న పొల్యూషన్ వ్యాన్ యజమాని వాహనాలను ఆపి సెస్ వసూలు చేస్తున్నారు. అయితే ఈ తంతు నెలల తరబడి జరుగుతున్నా సంబంధిత అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఏఎంసీ కార్యదర్శి వద్ద సాక్షి ప్రస్తావించగా.. చెక్‌పోస్టు వద్ద ఇద్దరు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. వారు తప్ప ఇతరులు వాహనాలు ఆపి, సెస్ వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

అర్ధరాత్రి యువకుల హల్‌చల్..

- బొలేరో వాహనాన్ని అడ్డగించి డ్రైవర్, మహిళలపై దాడికి యత్నం
- వరుస సంఘటనలతో బెంబేలెత్తుతున్న రాజాం వాసులు


స్థానికులకు దాడి వివరాలు చెబుతున్న బాధితుడు

రాజాం సిటీ: రాజాం ప్రాంతంలో విష సంస్కృతి జాడ్యం రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ నెల 18న స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో పట్టణ పరిధి మల్లికార్జునకాలనీకి చెందిన వ్యక్తిపై కత్తితో దాడి జరగగా.. ఇటీవల గరివిడి మండలం అప్పన్నవలస వద్ద రాజాం బంగారు వర్తకులపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. వీటిని మురువక ముందే మరో దాడి కలకలం రేపుతోంది. మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన రెడ్డి మహేష్ తన కుటుంబ సభ్యులతో చీపురుపల్లి పెళ్లికి వెళ్లారు. పెళ్లి అనంతరం అక్కడ నుంచి తిరిగి బొలేరో వాహనంతో స్వగ్రామానికి శుక్రవారం రాత్రి వస్తున్నారు. చీపురుపల్లి రోడ్డులోని బావిరేతమ్మ గుడి సమీపంలోకి రాగానే కొందరు యువకులు వాహనాన్ని అడ్డగించి దాడికి యత్నించారు. తిమ్మయ్యపేట సమీపంలో ఓ ద్విచక్ర వాహనాన్ని తిప్పుంచుకుని వస్తుండగా.. అదే వాహనంపై వస్తున్న యువకులు వేగంగా వచ్చి బావిరేతమ్మ గుడి వద్ద బొలెరోకు అడ్డంగా బండి పెట్టి దాడికి యత్నించినట్లు రెడ్డి మహేష్ తెలిపారు. వాహనంలో మహిళలు ఉన్నారని, ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని కోరగా.. వారు మరో నలుగురికి ఫోన్ చేయగా వారు కూడా వచ్చి దాడికి ప్రయత్నించారని చెప్పారు. ఇంతలోకారులో ఉన్న మహిళలు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారు వచ్చి ఒక యువకుడ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన వారు పరారయ్యారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇదే విషయమై టౌన్ సీఐ కె.అశోక్ కుమార్ వద్ద ప్రస్తావించగా.. అనుమానితులను పిలిపించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

పాచిపెంట: ముగ్గురు వ్యక్తుల నుంచి 10.21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రవీణ్‌కుమార్, శక్తి మురుగ అనే ఇద్దరు వ్యక్తులతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన అల్లంగిరి సురేష్ ఒడిశా నుంచి పాచిపెంట మీదుగా గంజాయి తరలిస్తుండగా.. పద్మాపురం పంచాయతీ రొడ్డవలస సమీపంలో శుక్రవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు శనివారం వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కోర్టు కానిస్టేబుళ్ల విధులే క్రియాశీలకం

- ఎస్పీ వకుల్ జిందల్


జూమ్ మీటింగ్‌లో కోర్టు కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: నిందితులకు శిక్షలు ఖరారు కావడంలో కోర్టు కానిస్టేబుళ్ల విధులు క్రియాశీలకమని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు కోర్టు కానిస్టేబుళ్లతో శనివారం జూమ్ మీటింగ్ నిర్వహించి, వారు నిర్వర్తించాల్సిన విధుల పట్ల దిశా నిర్దేశం చేశారు. అభియోగపత్రాలు సిద్ధం చేయడం, దాఖలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఆయా పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన కేసులు ఏ కోర్టుల్లో విచారణలో ఉన్నాయి.. ఏ కేసులో ప్రాసిక్యూషన్ జరగనున్నది.. తెలుసుకుని సాక్షులు సకాలంలో కోర్టుకు హాజరయ్యేలా చూడాలన్నారు. కొన్నిసార్లు కోర్టుల్లో దాఖలైన అభియోగ పత్రాలను న్యాయస్థానాలు తిప్పి పంపిన ప్పుడు, ఆ విషయాన్ని సంబంధిత పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువచ్చి, అవసరమైన మార్పులు చేసి తిరిగి కోర్టుల్లో దాఖలు చేయాలన్నారు. ప్రతి నెలా కోర్టులు జారీ చేసిన సమన్లు, వారంట్లను పోలీస్‌స్టేషన్ ప్రాసెస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు ప్రతిరోజూ తమ కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశమై ఆ రోజు కోర్టులో ప్రాసిక్యూషన్ జరిగిన తీరును, ఇతర విషయాలను అడిగి తెలుసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న గంజాయి, పోక్సో , రేప్, హత్య కేసుల ప్రాసిక్యూషన్ సమయంలో సీఎంఎస్ సిబ్బంది సహకారాన్ని తీసుకోవాలని కోర్టు కానిస్టేబుళ్లకు సూచించారు. జూమ్ మీటింగ్‌లో డీఎస్పీలు ఆర్.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఏవీ లీలారావు, పలువురు సీఐలు, ఎస్సైలు, వివిధ పోలీస్ స్టేషన్‌లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వధూవరులకు గాయాలు


గాయపడిన నూతన వరుడు రాజశేఖర్

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లి సబ్‌స్టేషన్ గోడకు పెళ్లి బృందం వెళ్తున్న కారు ఢీ కొట్టడంతో ఆరుగురికి గాయలయ్యాయి. పోలీసులు, బాధితులు తెలియజేసిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా కొండవెలగాడ గ్రామంలో వివాహం చేసుకున్న ఓ యువజంట బంధువులతో కలసి పెళ్లికుమార్తె ఇంటికి (సాలూరు మండలం భూతాడ కర్రివలస) బొలేరో వాహనంలో శనివారం ఉదయం వస్తున్నారు. సరిగ్గా మామిడిపల్లి సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి సబ్‌స్టేషన్ గోడకు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వధూవరులు సాధి రాజశేఖర్, చల్ల అనురాధతో పాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యసిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేసి సాలూరు పీహెచ్‌సీకి తరలించారు. ఇందులో పెళ్లికుమారుడు, డ్రైవర్లకు తీవ్ర గాయాలు కావడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు.


సబ్‌స్టేషన్ గోడను ఢీ కొట్టిన బొలేరో

నదిలో గల్లంతైన వ్యక్తి మృతి


నిరంజన్ మృతదేహం (ఇన్‌సెట్లో) నిరంజన్ (ఫైల్)

భామిని: వంశధార నదిలో గల్లంతైన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాల ప్రకారం...మండలంలోని తాలాడకు చెందిన వలరౌతు నిరంజన్ (49) ఈ నెల 22వ తేదీన ప్రమాదవశాత్తూ గ్రామసమీపంలోని వంశధార నదిలో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు గజ ఈతగాళ్లతో వెతికించగా.. శనివారం ఉదయం కీసర – కోసలి గ్రామాల మధ్య నిరంజన్ మృతదేహం లభ్యమైంది. ఎస్సై డి. అనిల్‌కుమార్ ప్రమాదస్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఏఎస్సై కాంతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్య శారద భామిని కేజీబీవీలో ఎస్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు..


వృద్ధుడి మృతదేహం

గుర్ల: మండలంలోని జమ్ముపేట రైల్వే గేట్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు రైలు ఢీ కొనడంతో మృతి చెందాడని రైల్వే ఎస్సై మధుసూదనరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మృతుడి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయన్నారు. చేతిలో కర్ర, తెలుపు లాల్చీ, తెలుపు పంచె ధరించి ఉన్నడని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 94934 74582 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పాముకాటుతో వ్యక్తి..


సింహాచలం (ఫైల్)

జామి: పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కలగాడలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, మృతుడి భార్య అందించిన వివరాల ప్రకారం.. కలగాడ గ్రామానికి చెందిన దాకరమర్రి సింహాచలం (44) ప్రతిరోజూ ఎల్.కోట మండలం గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్దకు పనికి వెళ్లి వస్తుంటాడు. శనివారం ఉదయం తన భర్త పనికి వెళ్తాడని చెప్పి అతడి భార్య క్యారేజీ సిద్ధం చేసి పనికి వెళ్లిపోయింది. అయితే సింహాచలం గ్రామ సమీపంలోని మామిడితోటలో పుట్టగొడుగుల కోసం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో సింహాచలం భార్య ఇంటికి రాగా.. క్యారేజీ ఉండడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. చివరకు మామిడి తోటలో పాముకాటుకు గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించగా..అప్పటికే సింహాచలం మృతి చెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹216

సాక్షి సండే క్లాసిఫైడ్స్

DUPLEX HOUSE FOR SALE
Duplex House for Sale 3 BHK E/F, 90 Sq.Yds, 1750 Sft. @ 55L in VUDA Residential, Behind Lorvens School, Vizianagagram. Ph : 80968 84445 [V- 12090]

FLAT FOR SALE
2 BHK, S2, 950 Sft. Sai Bhaskar Vihar, Ayannapeta, Pal Nagar, Vizianagaram. Rs. 17 Lakhs (Negotiable). Cont : 99123 35851 [V- 0338]

2 BHK S/F Flat with Lift & Car park @ 24.9L in VUDA Residential Zone, Muidam, Behind Lorvens School. Vizianagaram. Ph : 80968 84445 [V- 12091]

LAND FOR SALE
విశాఖపట్నం,అరకు,విజయనగరం మధ్యగల టూరిస్టు స్పాట్ S.kota తాటిపూడి లోకేషన్‌లో గెస్ట్ హౌస్ లేదా ఫామ్‌హౌస్‌కి అనుకూలమైన ఫార్మ్‌ల్యాండ్ వీకెండ్స్‌లో సరదాగా మన ప్రాపర్టీలో మనం స్పెండ్ చేసే విధంగా సైట్ చుట్టు ఫెన్సింగ్, గేట్, ట్రీ ప్లాంటేషన్ ఎలక్ట్రిసిటీ, గెస్ట్ రూమ్‌తో కేవలం 12సెంట్లు కలిపి 11లక్షలు మాత్రమే మరిన్ని వివరాలకు 6303940211, 8309634903 [S-1243274]

RENT / SALE
VZM, అలకానంద కాలనీ, గోకపేట జంక్షన్ వద్ద లక్ష్మీనివాస్2 అపార్ట్‌మెంట్‌లో 3 బెడ్‌రూం, కార్ పార్కింగ్‌తో అద్దెకు, ఇక్కడే 28x63 సైట్‌సేల్ & VSP, సాగర్ నగర్‌లో HIG2-110,GF (క్రింది ఇల్లు) అమ్మబడును. Cont: 9440189123, 6300393800 [S-1243471]

TO-LET
రాజాం నగర పంచాయతీ పాలకొండ రోడ్ గణపతి ఆలయం ప్రక్కన 40x50 బిల్డింగ్, 16x50, 16x40, 9x20, 8x17, అ॥షాపులకు, ఆఫీస్‌లకు, గోడౌన్‌లకు అద్దెకు కలవు. సంప్ర: 9440195667 [C- 799994]

BUSINESS OFFER
ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-2157]

HEALTH CARE
డా॥ నిర్మల వంగపండు MD - Gen, Med (DM-Neuro) Jimper మెదడు, నరములు, వెన్నెముక వ్యాధి నిపుణులు. ఆదివారం నుండి శుక్రవారం వరకు 9am to 6pm చూసెదరు. నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్, VZM, Appointment : 63054 71147 [V- 1913]

WANTED
ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ sal: 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 81218 18692 [G-9005]

హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796269]

కన్సల్టెన్సీ కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15–40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. ఫోన్: 7995984445 [HA-98255]

MS కంపెనీలో ఇంటి వద్దనే ఉండి టెలికాలింగ్ చేయుటకు పార్ట్ టైం / ఫుల్ టైం, మేల్ / ఫిమేల్ కావలెను. Qly: 10th, జీతం: 16000 to 18000. ఫోన్: 9550853907,8885238709 [HA-496]

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు,వాచ్‌మెన్స్,హౌస్‌కీపింగ్, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14548]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

